# అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

■ హామీలను అమలు చేయాలి ■ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఖిలావరంగల్, జూలై 10: అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి బోనస్ రూ. 500, డిసెంబర్‌లోగా రూ. 2 లక్షల రుణమాఫీ, రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా, ప్రతి ఎకరానికి సాగునీరు వంటి హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చి అధికారంలోకి వచ్చి, తర్వాత విస్మరించిందని ధ్వజమెత్తారు. ఎనిమిది నెలలు కావొస్తున్నా అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ఇప్పటి వరకు రాష్ట్రంలో 209 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలన చేతకాకపోతే గద్దె దిగాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే ఎం ధర్మారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 18 లక్షల కౌలు రైతులను దగా చేసిందని ఎద్దేవా చేశారు. హనుమకొండకు చెందిన మహిళా రైతు ఇటీవల ఆత్మహత్య చేసుకుందని, దీనికి సమాధానం మహిళా మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# జల్సాలకు అలవాటు పడి హత్య

■ నలుగురు నిందితుల అరెస్టు
■ రెండు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ. 1000 నగదు స్వాధీనం
■ వివరాలు వెల్లడించిన నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేటరూరల్, జూలై 10: కిరాణా షాపు యజమాని హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు నలుగురు నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. నర్సంపేట పట్టణం సర్వాపురం ఇందిరమ్మకాలనీకి చెందిన ఎస్‌కే రహీం(44), షహేదా దంపతులు కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉంది. ఈ నెల 1న షహేదా తన కుమారుడు రషీద్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో అతడిని తీసుకొని ఖమ్మం జిల్లాలోని సోదరుడి ఇంటికి వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో రషీద్‌ను చేర్పించి ఆపరేషన్ చేయించింది. ఈ నెల 6న రాత్రి సమయంలో ఎస్‌కే రహీం కిరాణా షాపును మూసివేసి నిద్రకు ఉపక్రమించాడు. ఇందిరమ్మకాలనీకి చెందిన దారంగుల ప్రవీణ్, బొంత రాజు, తాడెం పవన్, తాడెం శివకుమార్ జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాశతో అదేరోజు రాత్రి శివ ఇంట్లో రహీం హత్యకు ప్లాన్ చేసుకున్నారు. నలుగురు కలిసి రహీం ఇంటికి వెళ్లారు. వీరిలో రాజు, పవన్, శివకుమార్ ఇంటి ఎదుట కాపలా ఉండగా ప్రవీణ్ ప్రహరీ దూకి లోనికి వెళ్లాడు. ప్రవీణ్ తెలిసిన వ్యక్తి కావడంతో రహీం ఇంటి తలుపులు తీశాడు. వెంటనే ప్రవీణ్ రహీం ముఖంపై పిడిగుద్దులు గుద్ది, గొంతు నలిపి హత్య చేశాడు. అనంతరం నలుగురు కలిసి రహీం మృతదేహాన్ని ఇంటి ఎదుట ఉన్న బావిలో పడేశారు. తర్వాత ఇంట్లోకి వెళ్లి షాపులోని బీరు, మద్యం బాటిళ్లు, సిగరెట్ బాక్సులు, రూ. 1000 నగదును తీసుకెళ్లారు. ఈ నెల 7న బావిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఖమ్మంలో ఉన్న రహీం భార్య, కుమారుడికి సమాచారం అందించారు. వారు వచ్చి పోలీసులకు తెలియజేశారు. బావిలో చూడగా రహీం శవమై తేలాడు. మృతుడి కుమారుడు రషీద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బుధవారం నర్సంపేట నుంచి ఖానాపురం వెళ్లే ప్రధాన రహదారిలోని పాతబ్రిడ్జి వద్ద నిందితులు దాగి ఉన్నారనే సమాచారంతో అక్కడకు చేరుకొని ప్రవీణ్, రాజు, పవన్, శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరి నుంచి రెండు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ. 1000 నగదు, మద్యం సీసాలు, సిగరెట్ బాక్స్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బందికి వరంగల్ సీపీ అభినందనలు తెలిపారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్, సిబ్బంది కృష్ణ, రవి, తానీష, జగన్, రాఘవులు, రమేశ్, వంశీధర్, రాజు పాల్గొన్నారు.



బోనంతో వస్తున్న మంత్రి సురేఖ

## బంగారు బోనమెత్తిన మంత్రి సురేఖ

గీసుగొండ, జూలై 10: మండలంలోని కోటగండి కోట మైసమ్మ బోనాల పండుగ బుధవారం కనులపండువగా జరిగింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన స్వగ్రామం వంచనగిరి నుంచి బంగారు బోనం ఎత్తుకొని రెండు కిలో మీటర్లు మహిళలతో కలిసి నడిచి కోట మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మంత్రి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతి, నందిరాంనాయక్, సీఐలు బాబులాల్, మల్లయ్య, గోపి, రామకృష్ణ, పులి రమేశ్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, రడం భరత్, బీ శివ, కిశోర్, రాజలింగం, ఎం ప్రకాశ్, భీరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రజిత, మాజీ సర్పంచ్ అనసూర్య పాల్గొన్నారు.



పోచమ్మమైదాన్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

## పోచమ్మమైదాన్‌లో ధర్నా

కాశీబుగ్గ, జూలై 10: పోచమ్మమైదాన్ సెంటర్‌లో బుధవారం ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక హక్కులను కాపాడుకుందామని పిలుపునిస్తూ, కార్మికుల కోరికల దినంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించి కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టబెడుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో జమాషేక్, యాస్మాన్‌ఖాన్, రజాక్, ఫయాజ్‌బాబా, సదానందం పాల్గొన్నారు.

# ‘బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను ఆపాలి’



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

నర్సంపేట, జూలై 10: బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, వాటిని సింగరేణి సంస్థకు అప్పగించాలని ఏఐఎఫ్టియూ(న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎఫ్టీయూ(న్యూ) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరించాలనే ఆలోచనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణకు ఓపెన్ కాస్ట్‌లను నిలిపివేయాలని కోరారు. అండర్ గ్రౌండ్ బావులను తీయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూమా అశోక్, శివరాత్రి కుమార్, బొనగిరి రామ్మూర్తి, బోనగిరి సారయ్య, ఈర్ల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ తరగతులు

కాశీబుగ్గ, జూలై 10: కొత్తవాడ 80 ఫీట్ల రోడ్డులోని పద్మశాలీ భవనంలో నిర్వహించిన సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నేదునూరి జ్యోతి, మేకల రవి, తాటిపాముల వెంకట్రాములు, పంజాల రమేశ్, దామోర కృష్ణ, రహెలా, అమ్జద్ పాల్గొన్నారు.

## బాధిత పిల్లలకు ఉచిత విద్య

ఖానాపురం, జూలై 10: మండలకేంద్రంలోని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు జర్నలిస్టు మానెపల్లి శివ పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకొచ్చారు. శివ ఇటీవల మృతి చెందాడు. అతడి కూతురు ప్రవస్థి 6వ తరగతి, సాత్విక్ 5వ తరగతి చదువుతున్నారు. బుధవారం సుబ్బారావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రవస్థి, సాత్విక్‌కు 10వ తరగతి వరకు గీతాంజలి విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందజేస్తానని ప్రకటించారు. దీంతో చైర్మన్‌ను మండల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, నూకల పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.



పిల్లలకు ఉచిత విద్య ప్రకటిస్తున్న సుబ్బారావు

# అర్హులకే సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే నాగరాజు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట/పర్వతగిరి, జూలై 10: అర్హులకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పథకాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నేరుగా లబ్ధిదారులకే లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎలాంటి పొరపాట్లు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. భూ కబ్జాలు చేయడం, పేదలను ఇబ్బంది పెట్టడం, సంక్షేమ పథకాల అమల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ తదితరులు పాల్గొన్నారు. పర్వతగిరి మండలంలోని కొంకపాకలో రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. అలాగే, మండలంలోని పలువురు లబ్ధిదారులకు రూ. 4,83,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, చౌటపెల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, వైస్ చైర్మన్ మధుసూదన్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ మత్స్య రైతుల దినోత్సవం

ఖిలావరంగల్, జూలై 10: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ రాజన్న, డాక్టర్ గణేశ్, డాక్టర్ జే శశాంక్, అరుంజ్యోతి పాల్గొన్నారు,

## హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

చెన్నారావుపేట, జూలై 10: గ్రామాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయని, సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఎంసీపీఐయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో దయాకర్‌ను కలిసిన జన్ను రమేశ్ వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సరైన డ్రైనేజీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట రాజు, సాంబయ్య, అచ్చానాయక్ ఉన్నారు.



డాక్టర్ నిర్మలతో మాట్లాడుతున్న యూసుబ్

## ‘కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలి’

గిర్మాజీపేట, జూలై 10: ప్రభుత్వ దవాఖానల్లో పని చేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులైన శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సెబ్బంది కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీకేఎం దవాఖానను సందర్శించి సూపరింటెండెంట్ నిర్మలతో మాట్లాడారు. ప్రతి నెల 10లోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఎంఈ సర్క్యులర్‌లో కార్మికులకు రూ. 12,093 చెల్లించాలని ఉన్నా కొందరు కాంట్రాక్టర్లు కొన్ని దవాఖానల్లో పని చేస్తున్న కార్మికులకు రూ. 10,500 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, ఉపాధ్యక్షులు ఎండీ యాకు, రాజు, శంకర్, సక్కుబాయి, సంధ్య, శోభ పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, జూలై 10: ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులు, సంస్థలు లాభాపేక్ష లేకుండా సమాజ హితం కోసం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మైలారం గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి 20 మంది దివ్యాంగులకు రూ. 20 లక్షల విలువైన బ్యాటరీ ట్రైసైకిళ్లను ఉచితంగా అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాటోత్ హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తిరుమల మాడభూషణ కృష్ణమాచార్యులు, వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి, కుంట రమేశ్, కృష్ణారెడ్డి, భగవాన్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు పరిహారం అందించాం

■ నెలాఖరులోగా మరోసారి రైతులతో చర్చిస్తాం ■ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్య శారదాదేవి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలావరంగల్, జూలై 10: జిల్లాలో భూ నిర్వాసితులకు పరిహారాన్ని సకాలంలో అందించామని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ సభ్యుడు అనిల్ దరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వరంగల్ రీజినల్ రింగ్‌రోడ్డు, మంచిర్యాల–వరంగల్–ఖమ్మం–విజయవాడ కారిడార్ భూ సేకరణ పురోగతిలో ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా నిర్మించనున్న జాతీయ రహదారి వరంగల్ జిల్లాలో 38.2 కిలో మీటర్ల మేర వెళ్తుందన్నారు. ఇందులో 160 హెక్టార్ల భూ సేకరణ చేసి అవార్డులు పాస్ చేసి 168 లబ్ధిదారులకు రూ. 10.38 కోట్ల పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ధరల వ్యత్యాసం వల్ల మిగిలిన రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. ధరల పెంపు విషయంలో మెగా టెక్స్‌టైల్ పార్క్ భూ సేకరణ, రైల్వేకు సంబంధించిన ధరలను పరిగణలోకి తీసుకొని పరకాల ఎమ్మెల్యే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఇదివరకే చర్చించారన్నారు. ఈ నెలాఖరులోగా మరోసారి రైతులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. సమీక్షలో డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు

ప్రభుత్వ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, పారిశుద్ధం, తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధులు, మహిళా శక్తి క్యాంటీన్, ప్రజా పాలన దరఖాస్తుల తప్పుల సవరణ, అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు.



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

## ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

నర్సంపేట, జూలై 10: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి మోదీ, విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శులు ఎలకంటి రాజేందర్, గుర్రం అజయ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాలు లీక్ చేసి 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, భిక్షపతి, మల్లన్న, రాజేశ్, ఉషాకిరణ్, అఖిల్, శివ, ప్రశాంత్, రవి, అఖిల, పవిత్ర, పావని, శ్యామల, మహేందర్, కిరణ్, శ్యామ్, అనిల్, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

వరంగల్, జూలై 10: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తికి ప్రత్యేక చొరవ చూపాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం కుడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, చీఫ్ ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, కార్యదర్శి మురళీధర్‌రావు, ఏపీవో రామా రవీందర్, ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు.



కుడా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

## ‘మెపా’ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా వినయ్



చెన్నారావుపేట, జూలై 10: మెపా జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా లింగగిరి గ్రామానికి చెందిన తాడెం వినయ్‌ని నియమించినట్లు నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి బుధవారం తెలిపారు. ఈ మేరకు వినయ్‌కి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సింగారపు రామకృష్ణ, చిరంజీవి, రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి పాల్గొన్నారు.

## నేడు సన్నూరుకు చినజీయర్‌స్వామి

రాయపర్తి, జూలై 10: వెంకటేశ్వరపల్లిలోని స్వయంవ్యక్త వేంకటేశ్వరస్వామి ఆలయానికి త్రిదండి చినజీయర్‌స్వామి గురువారం రానున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి, అనువంశిక పూజారుల బృందం తెలియజేసింది. ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో జీయర్‌స్వామి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## విద్యార్థులకు బ్యాగుల బహూకరణ

గీసుగొండ, జూలై 10: కొమ్మాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రాజేందర్, నాగార్జున తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగులతో పాటు కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడ పని చేసినా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం

ఖిలావరంగల్, జూలై 10: కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రారంభించి విద్యార్థులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, మంజుల, మౌనిక, ప్రభాకర్, కృష్ణవేణి, పద్మ, వీణ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

సంగెం, జూలై 10: రాంచంద్రాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బర్ల యువరాజ్ తండ్రి వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ జిల్లా నాయకులు యువరాజ్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సారంగపాణి, సుదర్శన్‌రెడ్డి, బాలకృష్ణ, దిలీప్‌రావు, మల్లయ్య, మల్లయ్య, కిషన్‌రావు, ఆంజనేయులు, గోవర్ధన్‌గౌడ్, రమేశ్, రాజయ్య, వీరస్వామి, ఉప్పలయ్య, రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

## శిథిల భవనాలను త్వరగా గుర్తించాలి

వరంగల్, జూలై 10: గ్రేటర్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాలను గుర్తించి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కూల్చివేయాలన్నారు. 4 నెలల పాటు సెల్లార్లలో నిర్మాణాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీటి నిల్వ ఉండే సెల్లార్లను గుర్తించి నీటిని బయటికి వెళ్లేలా మోటర్లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సెల్లార్లలో విద్యుత్ ప్యానల్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార లే అవుట్లు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

## ‘లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి’

గీసుగొండ, జూలై 10: కేంద్ర ప్రభుత్వం తీసుకొవచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు చిన్నగారి రాణి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహసీల్దార్ రియాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

## ‘అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి’

వర్ధన్నపేట/గిర్మాజీపేట, జూలై 10: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట ప్రాజెక్టు పరిధిలో బుధవారం వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌సాగర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీరగోని నిర్మల, అనిత, నిర్మల, రేణుక, అరుణ, సత్యవతి, భారతి, స్వరూప, పద్మ, లక్ష్మి, మీనా పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043. NTW-318953

**వ్యవసాయ భూమి అమ్మబడును**



★12ఎ|| తరి పొలము, 10ఎ|| రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం||, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908 NTW-323325

**PLOT FOR SALE**

★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908 NTW-323326

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**నలంద గోల్డెన్ ఆఫర్**

★ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG. అక్టోబర్ పరీక్షల్లో 100% పాస్ గ్యారంటీ, 10th, ఇంటర్ ఫెయిల్ అయితే రీకౌంటింగ్ ద్వారా పాస్. ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. Ph: 8019383310. NT-325878

**CHANGE OF NAME**

★I, AKKARAJU SAROJINI SWARAJYALAXMI, W/o. AKKARAJU SURYA PRAKASH RAO, R/o. H.No. 13-2-255/1, Mattewada, Warangal, T.S.,-506002, India, have Changed my Surname & Name to KARANAM SAROJINI and solemnly declare. NTW-00

**CHANGE OF NAME**

★I, LINGAMPALLY MANJULA (New Name), previously called LINGAMPALLI MANJULA (Old Name), and residing at H.No. 2-6-1085, KLN Reddy Colony, Hanamkonda, Hanumakonda District- 506 001, T.S, India, and solemnly declare. NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565